క్లుప్తంగా

నీరు - మీరు అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు



రేపల్లె: స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర సాధనకై విద్యార్థులు శక్తివంతంగా పని చేయాలని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకుడు బి.కోటేశ్వరరావు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో నీరు - మీరు అంశంపై విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిసరాల స్వచ్ఛతతోనే స్వచ్ఛమైన ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పరిసరాల స్వచ్ఛతలో భాగంగా నీటిని స్వచ్ఛంగా ఉంచుకోవాలని, ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే స్వచ్ఛ పరిసరాలతో పాటు స్వచ్ఛమైన నీరు ఎంతో దోహదం చేస్తుందని సూచించారు. భవిష్యత్ తరాల కోసం నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.దాసు, సభ్యులు డాక్టర్ ఎం.బుజ్జిబాబు, కె.బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



నగరం: ఆపదలో ఉన్న వారికి అండగా ఉండి చేయూతనిస్తామని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. మండలంలోని పీటవారిపాలెంకు చెందిన దూళిపూడి అంజిబాబు, దూళిపూడి వెంకటేశ్వర్లు, దూళిపూడి నాగతేజలకు చెందిన పూరిళ్లు ఇటీవల అగ్నిప్రమాదంలో అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం తెలుసుకున్న డాక్టర్ గణేష్ గురువారం అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల చొప్పున అందజేశారు. అదే విధంగా పీతా పోతురాజు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పీతా మోహన్ అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, వంట పాత్రలు, దుస్తులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ బాధిత కుటుంబాలకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య, రేపల్లె పట్టణ, నిజాంపట్నం మండలాల కన్వీనర్‌లు కరేటి శేషగిరిరావు, యార్లగడ్డ వెంకట రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి కేవీ కృష్ణారెడ్డి, నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, చిమటా బాలాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల స్థల దాతలకు నివాళి



అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన దాతలను గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. అమర్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థల దాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర్తలూరు గ్రామానికి చెందిన రాపర్ల వీర రాఘవయ్య, 1 ఎకరం, కొత్తపల్లి వెంకట సుబ్బయ్య 3 ఎకరాలు, గ్రామీణ బ్యాంక్ సహకారం 1 ఎకరం కలిపి మొత్తం 5 ఎకరాలు విరాళంగా అందజేశారన్నారు. ఐదు ఎకరాల స్థలంలో మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్, గృహ నిర్మాణ శాఖ కార్యాలయం నిర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో మోదీ సుపరిపాలన కార్యక్రమం



వేమూరు: భారత ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన అందించడం జరిగిందని రాష్ట్ర ఎస్సీ మోర్చ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మోదీ పధ్రాని పదవి చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మోదీ సుపరిపాలన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రధానమంత్రి పదవి చేపట్టి 11 సంవత్సరాలు అయిందని, కేంద్ర ప్రభుత్వం పేదలకు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. అందువల్ల ప్రజలందరు మోదీ పరిపాలన కోరుకుంటున్నారన్నారు. మరలా నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బేతాపూడి వెంకటేశ్వరరావు, మంద జనార్దన్, యల్లమాటి దాసు, వెలివాల సాంబశివరావు, కొల్లూరు అమర్‌నాథ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో పచ్చపాతం

- దాదాపు ఆరు నెలలుగా లేని ఉపాధి పనులు
- మాతిపాలెంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు పనులు నిల్
- వరికూటి జోక్యంతో ఉపాధి పనుల కల్పన



మాతిపాలెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

వేమూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఉపాధి పనులు కల్పించడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. అమర్తలూరు మండలం మోపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని మాతిపాలెం గ్రామంలో దాదాపు ఆరు నెలల నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఉపాధి పనులు కల్పించడం లేదని కూలీలు చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులు జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రారంభిస్తారు. అప్పటి నుంచి జూలై వరకు ఉపాధి పనులు కూలీలు చేయడం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉపాధి పనులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు కల్పించడంకుండా కూటమికి చెందిన కుటుంబాలకు మాత్రమే ఉపాధి పనులు కల్పించుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కేంద్ర ప్రభుత్వ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పార్టీలతో సంబంధం లేకుండా ఉపాధి పనులు అందరికీ కల్పించాలి. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉపాధి హామీ పనులు కూటమి పార్టీలకు చెందిన కుటుంబాలకు మాత్రమే కల్పించడం విడ్డూరంగా ఉందని కూలీలు ఆశ్చర్యపోతున్నారు. ఉపాధి పనులు కల్పించాలని.. పనులు లేకపోతే కుటుంబాలు గడవడం కష్టంగా ఉంటుందని పనుల కల్పనలో పార్టీల వివక్ష చూపకుండా అందరికీ ఉపాధి పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

వరికూటిని ఆశ్రయించిన ఉపాధి కూలీలు

మోపర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని మాతిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఉపాధి పనులు కల్పించకపోవడంతో వారు అధికారులకు మొర పెట్టుకున్నారు. అయినా ఉపాధి పనులు కల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీంతో మాతిపాలెం ఉపాధి కూలీలు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఉపాధి పనులు కల్పించడం లేదని అశోక్‌బాబుకు చెప్పారు. ఆయన వెంటనే బాపట్ల జిల్లా డ్వామా అధికారులతో మాట్లాడి మాతిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు ఉపాధి పనులు కల్పించేలా చర్యలు చేపట్టారు.

ఉపాధి పథకం పనులు కల్పించలేదు



ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడగటం జరిగింది. కొన్ని గ్రూపులకు ఉపాధి పనులు కల్పించడం జరిగింది. మీ గ్రూపుకు పని వచ్చినపుడు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఆరు నెలల నుంచి ఉపాధి పనులు కల్పించలేదు.

– కె.కమలాకుమారి, మాతిపాలెం, అమర్తలూరు మండలం.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులని



వైఎస్సార్‌సీపీ మద్దతుదారులని మాతిపాలెం గ్రామంలోని కొన్ని కుటుంబాలకు ఆరు నెలల నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులు కల్పించ లేదు. గత వారంలో వరికూటి అశోక్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో పని కల్పించారు.

– జి.వంశీకృష్ణ, మాతిపాలెం, అమర్తలూరు మండలం

నా దృష్టికి వచ్చింది

మాతిపాలెం గ్రామంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించలేదని నా దృష్టికి వచ్చింది. ఏపీవోను పంపించి పనులు కల్పించడం జరిగింది.

– మారుతి శేషాంబ, ఎంపీడీవో, అమర్తలూరు

అరాచక పాలనలో అభివృద్ధికి మంగళం

మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లేశ్వరరావు

కొల్లూరు : అడ్డగోలుగా అరచాక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం అభివృద్ధికి మంగళం పాడి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతుందని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని ఈపూరులో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా మోసగిస్తుందని, ప్రశ్నించిన వారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కేసులు బనాయిస్తుందని విమర్శించారు. ఉచిత ఇసుక పేరుతో కూటమి ప్రభుత్వంలోని టీడీపీ నాయకులు అక్రమ ఇసుక తవ్వకాలతో జేబులు నింపుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచి మంచాల వసుంధర, నాయకులు నిమ్మగడ్డ వెంకటస్వామి, ఈపూరు సుబ్బారావు, యేమినేని శ్రీనివాసరావు, పిల్లి బుజ్జి, ఈపూరు రమేష్, కొండూరు శ్రీను, కొల్లి ప్రసాద్, టీవీ సుబ్బారావు, మార్పూరి గోపి కృష్ణ, తూమాటి భాస్కరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయంలో ఇంటింటికీ సంక్షేమం

చుండూరు(వేమూరు): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని మండల పార్టీ అధ్యక్షుడు అనపురెడ్డి రాఘరామి రెడ్డి అన్నారు. చుండూరు మండల కేంద్రంలోని రవిశంకర్ రెడ్డి స్వగృహంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఏడాది చంద్రబాబు మోసపూరిత పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు విశేషంగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గాదె శివరామకృష్ణ రెడ్డి, జాలాది రమేష్, గొరిపాటి రవిశంకర్ రెడ్డి, గొరిపాటి శ్రీనివాసర్ రెడ్డి, వుయ్యూరి మురళీ మోహన్ రెడ్డి, గజిని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈపూరులో పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



చుండూరులో పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నాటుసారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరం

ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు

నిజాంపట్నం: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని ఇన్‌చార్జి తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం దిండి గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటుసారాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రజల సహకారంతోనే నాటుసారాను నిర్మూలించగలమని, మండలంలో నాటుసారా తయారు చేసే గ్రామాలు, వ్యక్తులపై అధికారుల నిఘా ఉంటుందని చెప్పారు. నాటుసారా తయారీకి అవసరమైన ముడిసరుకు విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. తమ పరిధిలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, ముడిసరుకులు విక్రయించినా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచటం జరుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా నాటుసారా తయారు చేసే 27 పాత ముద్దాయిలను, 17 మంది బెల్లం వ్యాపారులను బైండోవర్ చేసి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపేందుకు ప్రభుత్వంకు నివేదించామన్నారు. రేపల్లె మండలం గుడ్డికాయలంక గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించి గ్రామస్తులను చైతన్యపరిచారు. గ్రామంలో నాటుసారా తయారు చేసి విక్రయించే 15 మందిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు, రేపల్లె, నగరం ఎక్సైజ్ సీఐలు దివాకర్, శ్రీరామ్‌ప్రసాద్, ఎస్‌ఐ రాజశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు

మోటూరు సేవలు అజరామరం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

భట్టిప్రోలు (కొల్లూరు) : పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయడంతోపాటు, తాను చేపట్టిన పదవులకు వన్నె తెచ్చిన మోటూరు సేవలు అజరామరం అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెల్లటూరులో రేపల్లె నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే, మాజీ రాజ్యసభ సభ్యులు, సీపీఎం అగ్ర నాయకుడు కామ్రేడ్ మోటూరు హనుమంతరావు వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. గురువారం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోటూరు హనుమంతరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజ హితం కోసం పాటుపడాలని అన్నారు. తొలుత వెల్లటూరు సెంటర్‌లోని మోటూరు విగ్రహం వద్ద సీపీఎం, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వెల్లటూరులో బహుమతులు విద్యార్థులతో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలి



దుగ్గిరాల: అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు తమ సమీపంలోని రైతుసేవా కేంద్రంలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏవో విజయబాబు తెలిపారు. మండల గ్రామాలైన మోరంపూడి, రేవేంద్రపాడులలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని అర్హత కలిగిన రైతులు 8,365 ఉండగా.. 8,032 రైతులు ఈకేవైసీ నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు శుక్రవారం లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఖరీఫ్ సాగు కోసం సబ్సిడీపై విత్తనాలు, కౌలు రైతుల సాగు హక్కు పత్రం కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి సన్మానం

అమర్తలూరు(వేమూరు): సాధారణ బదిలీల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తూ బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం చేయడం జరిగిందని ఎంపీడీవో మారుతీ శేషాంబ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బదిలీ అయిన సిబ్బందికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాపర్ల నరేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ విస్తరణాధికారిగా పని చేస్తున్న రవిశంకర్.. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయానికి, పరిపాలన అధికారిగా పని చేస్తున్న మహాలక్ష్మీ.. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా, సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.శశిధర్.. కొల్లూరు సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. అమర్తలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి బదిలీపై నెల్లూరు వెళ్లారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన సిబ్బందికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం చేసిన మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరం



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికల ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేస న శంకరరావు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్-విజయవాడ బృందం కంటి పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని రోటరీ క్లబ్ బాధ్యులు తెలి పారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి డి.మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, గుత్తా వెంకట రత్నం, పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, కె.ఉపేంద్ర, అలపాటి కిరణ్, వెంపటి హరిప్రసాద్, మల్లాది అర్జున్, ఆర్.సుబ్బారావు, ఎస్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కిలార్కి సేవలతో గర్భిణులు, బాలింతలకు మేలు


కొల్లూరు : గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్య సలహాలు, సూచనలు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిలార్కి కాల్ సేవలతో ఎంతో మేలు చేకూరుతుందని కిలార్కి ప్రోగ్రాం అధికారి రాజు అన్నారు. శుక్రవారం కొల్లూరు పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందికి కిలార్కి కాల్ సేవలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిలార్కి కాల్ ద్వారా గర్భిణులు, తల్లీబిడ్డలకు ఆరోగ్య సమాచారం అందించడం జరుగుతుందని వివరించారు. గర్భిణికి 4వ నెల నుంచి పుట్టిన బిడ్డకు ఏడాది పూర్తయ్యే వరకు వారానికి ఒకసారి కిలార్కి సేవల రూపంలో బాలింతలు, గర్భిణులకు ఫోన్ కాల్స్ వస్తాయన్నారు. 01244451660 నంబర్‌ను గర్భిణులు, బాలింతలు తమ ఫోన్‌లలో సేవ్ చేసుకొని ప్రభుత్వం అందించే ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు, ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. కిలార్కి కాల్ సమాచారాన్ని తిరిగి తెలుసుకోవాలనుకున్న పక్షంలో 14423 టోల్ ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేస్తే తిరిగి వినడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సేవలపై వైద్య, ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారి వి.కావ్య, సీహెచ్‌వో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కిలార్కి సేవలపై కొల్లూరు పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమం

శివారు ప్రాంతాలకు అందని నీరు

- నీటి పంపింగ్‌లో జోన్ల పద్ధతి వస్తే బాగుంటుందంటున్న స్థానికులు
- ఇప్పటికీ సగం కాలనీలకు సక్రమంగా అందని నీరు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న మున్సిపాల్టీ అధికారులు



ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి పైపులైన్లకు బిగించిన వాల్వ్

బాపట్ల: పట్టణంలో అన్ని ప్రాంతాలకు మున్సిపల్ నీరు సజావుగా సరఫరా చేసే పనులు ఇప్పట్లో కనిపించటం లేదు. నీటి సరఫరాలో జోన్ల పద్ధతి లేకపోతే సజావుగా నీటి సరఫరా జరగకపోగా శివారు ప్రాంతాల్లో కనీసం చుక్క నీరు కూడా రాని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని కనీసం నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులను కలిపి ఆరు జోన్లుగా విభజించి నీటిని సరఫరా చేస్తే నీటి సరఫరా సజావుగా జరుగుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణకు మాత్రం నోచుకోవటం లేదు.

అరకొరగానే నీరు

మహానేత డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.15 కోట్లతో కొత్త ఫిల్టర్‌బెడ్, పైపులైన్లు ఏర్పాటు చేసినప్పటికీ పురప్రజలందరికీ సజావుగా నీటి సరఫరా జరగటం లేదు. బాపట్ల పట్టణ విస్తీర్ణం 20.5 కిలోమీటర్లు ఉండగా 12,700 కుళాయిలు ఉన్నాయి. ఉన్న కుళాయిల్లో రెండు వేల కుళాయిలకు పైగా సజావుగా నీరు రాకపోవటంతో నిరూపయోగంగా కుళాయిలు ఉండిపోయాయి. అన్ని ప్రాంతాలకు ఒక్కసారిగా నీరు వదలడంతో పైపులైన్లకు శివారు ప్రాంతానికి నీరు చేరే సమయానికి నీటి సరఫరా నిలిచిపోతుంది. పైపులైన్లు మొదట్లో ఉన్న ప్రాంతాలకు మాత్రం నీరు సమృద్ధిగా రావటంతో ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు నీటి వృధాకు పాల్పడుతున్నారు. వీటి గురించి పట్టించుకోవాల్సిన మున్సిపాల్టీ అధికారులు కనీసం స్పందించటం లేదు.

ఉప్పరపాలెం ఓవర్‌హెడ్ ట్యాంకుకు అడ్డంకులు

ఉప్పరపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తే ఆ ప్రాంతంలో నీటి సరఫరా సజావుగా సాగుతుందని నిర్మాణం పూర్తి చేశారు. అయినప్పటికీ ఓవర్‌హెడ్ ట్యాంకు ఆలానా... పాలానా చూసే నాథుడే కరువయ్యారు. ఈ ట్యాంకును ఉపయోగించుకుంటే ఒకటి నుంచి నాలుగు వార్డులకు నీటి సరఫరా సాగే అవకాశం ఉంది. వీటితోపాటు బాపట్ల పట్టణంలో ప్యాడిషన్‌పేట, బేతనీకాలనీ, డ్రైవర్స్ కాలనీలో కూడా కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టారు. పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ, శారదపురికాలనీ, దేవుడుచెరువు, మున్నంవారిపాలెం, శ్రీనివాసకాలనీ, ప్యాడిషన్‌పేట, యాదవపాలెంలో సక్రమంగా నీటి సరఫరా జరగటం లేదు.

జోన్ల పద్ధతి వస్తే మెరుగుపడుతుంది

జోన్ల వ్యవస్థ వస్తే మంచినీటి సరఫరా మెరుగుపడుతుంది. జోన్లు లేకపోవటం వలన నీటి సరఫరా జరిగిన పైపులైన్లు మొదట్లో ఉన్న ప్రాంతాలకు ఎక్కువ నీరు రావటం చివరి ప్రాంతంలోని వారికి తక్కువ నీరు వెళ్లటం జరుగుతుంది.

– ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, దీఈ, బాపట్ల

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

కొల్లూరు : ట్రాక్టర్ అదుపుతప్పి పల్లపు ప్రదేశంలోకి పల్టీ కొట్టడంతో డ్రైవర్ మరణించిన ఘటన మండలంలోని పెసర్లంక నక్కపాయ మార్గంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన చొప్పర నాంచారయ్య (44) వంట పనులతోపాటు, వ్యవసాయ కూలీలకు మేస్త్రిగా వ్యవహరిస్తూ పొలం పనులు చేయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తన సోదరుడి కుమారుడికి ఆరోగ్యం బాగోకపోవడంతో బుధవారం అతని స్థానంలో నాంచారయ్య పెసర్లంకకు చెందిన అన్నంనేని రాజేష్‌కు చెందిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా వెళ్లాడు. కొల్లూరు కరకట్ట దిగువన ఉన్న ఇటుక బట్టీలకు వెళ్లే పెసర్లంక నక్కపాయ మార్గంలో ట్రాక్టర్ లోడ్ కోసం వెళుతున్నాడు. ఒకే వాహనం పట్టేంత దారి మాత్రమే ఉండే నక్కపాయ మార్గంలో నాంచారయ్య నడుపుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న సుమారు 6 అడుగుల పల్లపు ప్రాంతంలోకి బోల్తా కొట్టింది. ట్రాక్టర్ అకస్మాత్తుగా పల్టీ కొట్టడంతో ట్రాక్టర్ ఇంజన్ నాంచారయ్యపై పడి అక్కడికక్కడే మరణించాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు మృతుడి బంధువులతో పాటు, పోలీసులకు సమాచారం అందించారు. కొల్లూరు పోలీసులు ప్రమాద తీరుని గమనించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య ఉంది. ట్రాక్టర్ ఇంజన్ పైన పడి నాంచారయ్య మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు.



పల్టీ కొట్టిన ట్రాక్టర్ ఇంజన్ కింద ఇరుక్కుపోయి మరణించిన నాంచారయ్య

సేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



తెనాలి: భగవత్ కృప పొందటానికి ఏ సాధనమును అవలంబించాలో శాస్త్రాలు తెలియజేశాయనీ, ఆ ప్రకారం కలియుగంలో దానం ముఖ్యమైందని శ్రీసాయిప్రసాదం సేవాసమితి అధ్యక్షుడు సాయి లక్కరాజు అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్ లోని పట్టణ పేద నిరాశ్రయుల ఆశ్రమంలోని పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరయుగంలో యజ్ఞం అనుసరించాల్సిన సాధనాలుగా వివరించారు. అన్నదాన వితరణను చిట్టూరి నాగరాజు, అరుణలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సేవాసమితి సభ్యుడు విశ్రాంత ఎంపీడీవో జె.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తునికి ఉచితంగా మందులు పంపిణీ

బాపట్ల: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న శ్రీసాయి ప్రభాకర్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ బాపట్ల జిల్లా కార్యదర్శి బి.ఎస్.నారాయణభట్టు ఉచితంగా గురువారం మందులు పంపిణీ చేశారు. వైద్య సహాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను కోరటంతో ఆయన ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ కార్యదర్శి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెల తప్పనిసరిగా మందులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు మూర్తి, నవనీతం, జాషువా, లావణ్య ఉన్నారు.